www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 18 మార్చి 2024

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

పుల్లంపేట : మండల పరిధిలోని కెజిబివి పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దర ఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రూత్ మేరీ ఒక ప్రకటనలో తెలి పారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ఏప్రిల్ 11న ముగుస్తుందన్నారు. పాఠశాలలో ప్రవేశం పొందే విద్యార్థుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, విద్యార్థి ప్రస్తుతం చదువుతున్న పాఠశాల వివరాలు, ఫోన్ నెంబర్లతో సహా రెండు జతల జిరాక్స్ కాపీలు పాఠశాలలో సమర్పిస్తే ఆన్‌లైన్ చేస్తామని తెలిపారు. డ్రాప్ ఔట్స్, అనాథలు, బడి బయట చిన్నారులు, దారిద్ర రేఖకు దిగువన ఉన్నవారు, ఎస్‌సి,ఎస్‌టి, బిసి, మైనార్టీ బాలికలకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో వారికి రూ.1.20లక్షలు, పట్టణ ప్రాంతాల్లో వారికి రూ.1.40లక్షలు మించి ఆదాయం ఉండకూడదని అన్నారు. ఆన్‌లైన్ పూర్తయిన తర్వాత అర్హుల జాబితా రాష్ట్ర కార్యాలయం నుంచి నేరుగా అభ్యర్థుల ఫోన్లకే సమాచారం అందుతుందని తెలపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ప్రారంభం
- పరీక్షలు రాయనున్న 25,522 మంది విద్యార్థులు
- జిల్లా వ్యాప్తంగా 129 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఇఒ శివప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

పదో తరగతి పరీక్షల సోమవారం ప్రారంభంకానున్నాయి. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 492 పాఠశాలలున్నాయి. ఎయిడెడ్ 5, ఎపిఎంఎస్ 17, ఎపిఆర్ఎస్ 6, ఎఎస్‌హోచ్ ఆర్ఎం 1, బిసి వెల్ఫేర్ 4, ప్రభుత్వ తొమిది కేజీబీవీ 22, ఎంపీఎల్ 5, ప్రయివేట్ 190, స్కూల్ వెల్ఫేర్ 11, ట్రైబల్ వెల్ఫేర్ 8, జడ్‌పి 214 పాఠశాలలున్నాయి. పదో తరగతి పరీక్షలు ఉదయం 9:30 నుంచి 12:45 నిమిషాల వరకు జరుగుతాయి. జిల్లావ్యాప్తంగా 25,522 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. రెగ్యులర్ విద్యార్థులు 22,466, బాలురు 11,254, బాలికలు 11,212, ఒక్కసారి ఫెయిల్ అయిన విద్యార్థులు 3056, బాలురు 1749, బాలికలు 1307 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.జిల్లా వ్యాప్తంగా 129 కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఇందులో ఎ కేటగిరి 58, బి కేటగిరి 55, సి కేటగిరి 16 సెంటర్లు ఏర్పాటు చేశారు. చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్లు 129, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు 129, రూట్ ఆఫీసర్‌లు 10, ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆరుగురిని నియమించారు. పరీక్ష జరిగే సమయంలో ఉదయం, మధ్యాహ్నం ఆర్‌టిసి బస్సును సౌకర్యాలు కల్పిస్తున్నారు. పరీక్ష సమ యంలో విద్యుత్ అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. ప్రతి సెంటర్‌లో ఎఎన్ఎం అందుబాటులో ఉంటారు. తాగనీరు, మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేశారు. జిరాక్స్ సెంటర్లను కూడా మూసివేస్తున్నారు.

పకడ్బందీగా నిర్వహిస్తాం

నేటి నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా పగడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం .మొబైల్స్, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రానికి తీసుకురాకూడదు. విద్యార్థులు టీవీలు, సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలి. విద్యార్థులపై తల్లి దండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. సెంటర్‌లోకి విద్యార్థులు అరగంట ముందుగానే హాజరు కావాలి. విద్యార్థులకు ప్రతి సెంటర్లో కావాల్సిన మౌలిక సదుపాయాలన్నీ ఏర్పాటు చేశాం. కావున విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షరాసి అన్నమయ్య జిల్లాను రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలపడానికి సహకరించాలి. ఏవైనా సమస్యలుంటే విద్యార్థులు 9100040686లో సంప్రదించాలన్నారు.

- యు.శివ ప్రకాష్ రెడ్డి, జిల్లా విద్యా శాఖ అధికారి, అన్నమయ్య జిల్లా.

ఉచిత బస్సు సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు

10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆర్‌టిసి బస్సుల్లో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ప్రయాణ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పీలేరు ఆర్‌టిసి డిపో మేనేజర్ బండ్ల కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉచిత బస్సు సర్వీసులు సోమవారం ఉదయం నుంచి అందుబాటులోకి రానున్నాయని అన్నారు. పదో తరగతి పరీక్షలు రాయడానికి వెళ్లే విద్యార్థులందరూ తమ పరీక్ష హాల్ టికెట్ చూపి ఆర్‌టిసి బస్సుల్లో పరీక్షా కేంద్రం వరకు ఉచితంగా ప్రయాణం చేసి పరీక్షలను ప్రశాంతంగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని చెప్పారు. విద్యార్థులు ఈ సౌకర్యం వినియోగించుకుని పరీక్షలు బాగా రాసి అత్యున్నత మార్కులు సాధించాలని తెలియజేశారు. పరీక్షల సమ యానికి అనుకూలంగా బస్సులను నడుపడానికి తగిన చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు.

ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేస్తాం

కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేస్తామని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనాకు వివారించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల నియామవాళిని అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పటిష్టంగా అమలు పరచడంలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఆదివారం రాష్ట్ర సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ హాజరై జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సన్నద్ధత, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లోను, 48 గంటల్లో ప్రయివేట్ వ్యక్తుల స్థలాల్లోనూ అనుమతి లేకుండా ఉన్న రాజకీయ ప్రకటనలను తొలగించాల్సి ఉందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ఈ నియమ నిబంధనలను పటిష్టంగా అమలు పర్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సి-విజిల్లో అందే ఫిర్యాదులపై 100 నిమిషాల్లోపు, ఎన్నికల సంఘం నుంచి అందే ఫిర్యాదులపై అదే రోజున చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల కోసం అన్ని విధాలా సంసిద్ధత ఎంతో కీలకమైందన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్ - ఎంసిసి) అమలుపై అందరు ఎన్నికల అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఎంసిసి, ఎఫ్.ఎస్.టీ టీమ్ లు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్న రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు, ఫొటోలను, ఇతర క్యాలెండర్లు, జెండాలను, బస్టాండ్, రైల్వే స్టేషన్లలో, రోడ్డు కిరువైపులా, మీటింగ్ ప్రాంతాల్లో అన్ని హోర్డింగులను తక్షణమే తొలగించేలా రిటర్నింగ్ అధికారులు సంబంధిత ఎఆర్‌ఒలు, ఎంపిడిఓలతో మాట్లాడాలని, అన్నింటినీ తక్షణమే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ సూచనలు తప్పనిసరిగా పాటించి ఎన్నికల నిర్వహణ కోసం అన్ని విధాలా సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణరావు, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

సిఎస్ విసిలో పాల్గొన్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, జెసి, అధికారులు

జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలి

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్ర ప్రజలు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని పీలేరు, కెవిపల్లె మండలాల వైసిపి ఎన్నికల బాధ్యులు పెద్దిరెడ్డి సుధీర్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన పీలేరు పట్టణంలోని బాపూజీ నగర్, మోడల్ కాలనీల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరిగి ప్రజలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి రెండో సారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీగా పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డిని, పీలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా చింతల రామచంద్రా రెడ్డిని గెలిపించి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జి.వి. రాకేష్ రెడ్డి, మాజీ ఎఎంసి ఛైర్మన్ కడప గిరిధర్రెడ్డి, ఎంపిటిసి కంభం నరసింహారెడ్డి, వార్డు సభ్యులు సాంబశివారెడ్డి, నాయకులు జయచంద్రారెడ్డి, రెడ్డిబాష, అభిషేక్, హుమయూన్, చక్రధర్, విజయశేఖర్ రెడ్డి, దావూద్ పాల్గొన్నారు.

50 కుటుంబాలు వైసిపిలో చేరిక

పీలేరు పట్టణం, తిరుపతి రోడ్డు, బండ్లవంక, ఆర్‌టిసి నల్లగుట్ట తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 50 కుటుంబాలు టిడిపి నుంచి వైసిపిలో చేరాయి. శనివారం పీలేరు, కెవి పల్లె మండలాల వైసిపి ఎన్నికల బాధ్యుడు పెద్దిరెడ్డి సుధీర్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథరెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చు కున్నారు. అందరికీ వారు వైసిపి కండువాలతో పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బాబు, తిరుపతయ్య, వెంకటరమణ, రామాంజులు, చంద్ర, మర్రెడ్డి, చంద్రారెడ్డి, సాగర్, రమణమూర్తి, ప్రతాప్ రెడ్డి, మర్రెడ్డి, జయరాం, జయరామిరెడ్డి, సుశీల ఉన్నారు. కార్యక్రమంలో ఎంపిపీ సతీష్ రెడ్డి, దినకర్‌రెడ్డి, కడప గిరిధర్‌రెడ్డి, మనోదయరెడ్డి, విక్టరీ వెంకటరమణారెడ్డి, చక్రధర్, చైతన్యరెడ్డి, కాలనీ చిన్న పాల్గొన్నారు.

కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పెద్దిరెడ్డి సుధీర్‌కుమార్‌రెడ్డి

అయోమయంలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లి

షాజహాన్‌బాషను టిడిపి అభ్యర్థిగా ప్రకటించగానే వైసిపి నాయకులు ఓటమి భయంతో అయోమయంలో పడి అనవసర విమర్శలు చేసి అభాసుపాలైయ్యారని టిడిపి రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేష్ అన్నారు. ఆదివారం నిమ్మనపల్లె సర్కిల్ వద్ద తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ది ధృతరాష్ట్ర కౌగిలి అంటూ ఎద్దేవా చేశారు. పీలేరు నియోజకవర్గంలో నాటి మైనారిటీ నేత మొగల్ సైఫుల్లా భేగ్ పైకి వచ్చిన సంగతి ప్రతి ముస్లిం మైనారిటీ తెలుసుకోవాలని సూచించారు. పెద్దిరెడ్డి కంటే ముందే నారాయణ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ముస్లిం మైనారిటీకి మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఇచ్చిన చరిత్ర గుర్తు చేశారు. ముజీబ్ హుసేన్‌ను వైస్ ఛైర్మన్ కాలేదా అని గుర్తు చేశారు. ముస్లిం మైనారిటీలకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డి చేసింది శూన్యం అన్నారు. పెద్దిరెడ్డి కబంధహస్తాల కింద నలిగి రాజకీయ భవిష్యత్తు లెకుండా పోయిన వారిలో సిపి సుబ్బారెడ్డి, ముజీబ్ హుస్సేన్, తిప్పారెడ్డి, నరేష్ కుమార్ రెడ్డి, జింక చలపతి ఉన్నారని విమర్శించారు. పెద్దిరెడ్డి కుటుంబానికి బలి కాబోతున్న మరో వ్యక్తి నిస్సార్ అహమ్మద్ అని, ఇప్పటికైనా మెలుకొని జాగ్రత్త పడాలని హెచ్చరించారు. మదనపల్లెలో వక్ఫ్ బోర్డుకు చెందిన ఆస్తులు కాపాడటంలో షాజహాన్ బాష కీలక పాత్ర పోషించారని వెల్లడించారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా షాజహాన్ బాష పైన విమర్శలు సహించమని, అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని ప్రకటించారు. సమావేశంలో రాటకొండ మధుబాబు, అన్వర్ బాష, రామచంద్ర పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్

ప్రజా చైతన్యం కలిగించడమే లెనినిజం

లెనిన్ పుస్తకావిష్కరణ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి, ప్రజా వైద్యులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉమ్మడి ప్రయోజనాల పట్ల ప్రజా చైతన్యం కలిగించడమే లెనినిజమని, చరిత్ర నిర్మాతలు ప్రజలేనని లెనిన్ సూక్తి అని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక సి.పి.బ్రౌన్ గ్రంథాలయ సమావేశ మందిరంలో సిపిఎం జిల్లా కార్యదర్శి అధ్యక్షతన 'లెనిన్ నేడు లేడు .. చూడు జనంలో ఉన్నాడు" లెనిన్ జీవిత కథనం పిళ్లా కుమారస్వామి రాసిన 35 పేజీల పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ పుస్తకాన్ని ప్రముఖ ప్రజా వైద్యులు డాక్టర్ సి.ఓబుల్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కారల్ మార్క్స్, ఏంగిల్స్ కలిసి క్యాపిటల్ గ్రంథాన్ని రాసి శ్రమ దోపిడీ రహిత సమాజ నిర్మాణం శాస్త్రీయంగానే ఆచరణాత్మకంగా సాధ్యమని, 'కార్మిక వర్గ రాజ్య నిర్మాణం' గతితార్కిక, చారిత్రిక భౌతిక వాద పరిణామాన్ని, ఆర్థిక శాస్త్రాన్ని, తాత్విక శాస్త్రంతో మేలవింపు చేసి రాసిన ఆచరణాత్మక మైనది శాస్త్రీయ సోషలిజం, కమ్యూనిజం అన్నారు. ఉమ్మడి ప్రయోజనాల పట్ల ప్రజలలో ప్రజా చైతన్యం కలిగించడమే లెనినిజమని చెప్పారు. చరిత్ర నిర్మాతలు ప్రజలేనని, మేధో సిద్ధాంతాన్ని ఆచరణ సాధ్యం చేసినది లెనిన్ అని కొనియాడారు. మానవజాతి పీడన విముక్తికి శాస్త్రీయ సిద్ధాంతం మార్క్సిజమేనని లెనిన్ నమ్మి, ఆచరించి, తొలి సోషలిస్టు రాజ్యం ఆయుర్భావం చేయటంలో విజయం సాధించారన్నారని అన్నారు. ప్రముఖ ప్రజా వైద్యులు డాక్టర్ సి.ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ లెనినిజం ఆచరణలో ఆయా దేశాల ప్రత్యేక భౌతిక పరిస్థితులకు, నిర్దిష్ట విశ్లేషణ, నిర్దిష్ట కార్యచరణతో, అర్థం చేసుకొని, అన్వయించుకుని, ఆచరిస్తే చైనాలో, వియత్నాంలో, క్యూబాలో, లావోస్లో , పేరులో , వెనిజులాలో అనేక లాటిన్ అమెరికా దేశాలలో పెట్టుబడిదారీ ఆర్థిక విధానానికి ప్రత్యామ్నాయ ఆర్థిక విధానం సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఎం సీనియర్ నాయకులు బి.నారాయణ, హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి సి.ఆర్.వి.ప్రసాద్, న్యూ డెమోక్రసీ జిల్లా కన్వీనర్ డబ్ల్యూ.రాము, ఆర్.ఎస్.పి. జిల్లా కార్యదర్శి కె.సుబ్బరాయుడు, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కన్వీనర్ జె.జయవర్ధన్, సిపిఐ (ఎం.ఎల్) లిబరేషన్ జిల్లా కన్వీనర్ జి.రమణయ్య, న్యూ డెమోక్రసీ-టు జిల్లా కన్వీనర్ యం.అంకన్న, రైతు స్వరాజ్య వేదిక నాయకులు శివారెడ్డి, ప్రముఖ న్యాయవాది అమీర్ పేరా, సాక్షి పత్రిక జర్నలిస్టు మహమ్మద్ బాష, సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్, సిపిఐ నగర కార్యదర్శి వెంకటశివ, సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి లెనిన్ ప్రసాద్ మాట్లాడారు.

ఎన్నికల నియమావళికి తూట్లు

తొలగించని వైసిపి, టిడిపి ఫ్లెక్సీలు

ప్రజాశక్తి-పీలేరు

దేశవ్యాప్తంగా ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చి 24 గంటలు దాటినా పీలేరు పట్టణంలో దాని ఆనవాళ్లు కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది. నిబంధనల ప్రకారం తొలగించాల్సిన రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచార సామగ్రిని పూర్తిగా తొలగించడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారు. పట్టణంలో ఎంపీ గ్రాంట్స్‌తో ఏర్పాటైన నీటి శుద్ధి ట్యాంకర్లపై రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి ఫొటోలు, పేర్లతో ఏర్పాటుచేసిన బోర్డులను కొన్ని చోట్ల తొలగించలేదు. అదేవిధంగా రాజకీయ పార్టీలు తమ పార్టీల ఎన్నికల గుర్తులు, నేతలు, నాయకుల చిత్రాలతో తయారుచేసి ప్రచారం కోసం పట్టణంలో విద్యుత్ స్తంభాలకు కట్టిన జెండాలు, బోర్డులను కూడా ఇంకా తొలగించకపోవడంలో సంబంధి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై పలు విమర్శలకు దారి తీస్తోంది. ఎన్నికల ప్రచార సాధనాలు, రాజకీయ పార్టీల నేతలు, నాయకుల ఫొటోలతో ఏర్పాటు చేసిన కటౌట్లు, బోర్డులను ప్రధాన ప్రాంతాల్లో తొలగించారే తప్ప, మారుమూల ప్రాంతాల్లో వాటిని తొలగించడానికి తగిన శ్రద్ధ చూపలేదన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వాటి తొలగింపుకు లేదా కప్పి పెట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక పౌరులు విజ్ఞప్తి చేసుకుంటున్నారు.

పట్టణంలో ఓ వీధిలో తొలగించని టిడిపి, వైసిపి జెండా, ఫ్లెక్సీలు

గాలివీడు : ఫ్లెక్సీలను తొలగింపజేస్తున్న ఎంపిడిఒ శ్రీనివాసులు

రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు తొలగింపు

ప్రజాశక్తి-కలకడ

మండలంలో వివిధ ప్రాంతాలలో ఉన్న రాజకీయ నాయకులు ఏర్పా టు చేసిన ఫ్లెక్సీలను తొలగించినట్లు కలకడ విఆర్‌ఓ రెడ్డి శేఖర, పంచాయతీ కార్య దర్శి దేవేంద్రలు తెలిపారు. దేశ, రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నం దువల్ల రాజకీయ నాయకులకు చెందిన బ్యానర్లు, కటౌట్లు, గోడపత్రికలు ఉండ టం గుర్తించి వాటిని తొలగిస్తున్నట్లు తెలిపారు. కలకడ సమీపంలోని సత్యవతి నది బ్రిడ్జికి ఇరువైపులు ఉన్న గోడ పత్రికలు, బస్టాండ్ ప్రాంతంలో గోడ పత్రికలు తొలగించినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడ గాని రాజకీయ నాయ కులకు సంబంధించిన ఏవైనా బ్యానర్లు ఉన్నయెడల వాటిని తొలగిస్తామని చెప్పారు. రాజకీయ పార్టీల నాయకులు తమకు సహకరించాలని వారు కోరారు. కార్యక్ర మంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.**గాలివీడు :** రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్అమలు కావడంతో గేటు నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న రాజ కీయనాయ కులతో ఉన్న ఫ్లెక్సీలను ఎంపిడిఒ శ్రీనివాసులు ఆధ్వర్యంలో తొలగింపజేశారు.

టిడిపితోనే ముస్లిములకు న్యాయం

ప్రజాశక్తి-మదనపల్లి

ముస్లిము మైనార్టీలకు న్యాయం చేసింది టిడిపి అధ్యక్షులు చంద్రబా బేనని మదనపల్లి టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన స్థానిక విలేకరుల సమావేశంలో మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ టిడిపి ప్రభుత్వంలోనే ముస్లిములకు సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. మదనపల్లి టిడిపి అభ్యర్థిగా ఖరారైన మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, ఆయన కుటుంబంపై పలువురు వైసిపి నాయకులు పలు ఆరోపణలు చేశారని అన్నారు. ఎస్‌ఎ.మస్తాన్, ఎండి.రఫీ, మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్‌లు మాట్లాడుతూ షాజహాన్‌పై వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో బాలుస్వామి, నాదెళ్ల శివప్రసాద్ పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నాదెళ్ల విద్యాసాగర్

ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ 'స్పందన' రద్దు

ప్రజాశక్తి - రాయచోటి

సాధారణ ఎన్నికలు -2024 సందర్భంగా ఈ నెల 18 నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు 'స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

మోడీ హయాంలో దేశం పతనం : కాంగ్రెస్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మాట్లాడుతున్న పూలభాస్కర్

ప్రధాని నరేంద్ర మోడీ హయాంలో దశాబ్ద కాలం పాటు దేశం అన్ని విధాలా పతనమైందని పిసిసి అధికార ప్రతినిధి పూల భాస్కర్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ నరేంద్ర మోడీ ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని, నిరుద్యోగం, ఆకలి చావులు, ఆచిత నేరాలు పెరిగాయని అన్నారు. నోట్ల రద్దు, ఆర్థిక నేరస్తుల పత్రాలు మాయం చేయడం, చిన్న వ్యాపారస్తులను జిఎస్‌టి రూపంలో పతనం చేయడం, ఎల్ఐసి, ఎయిర్ ఇండియా, రైల్వే స్టేషన్, భారత్ పెట్రోలియం, బిఎస్ఎన్ఎల్, షిప్పింగ్ కార్పొరేషన్, యూనివర్సిటీలను అమ్మకానికి పెట్టారని ఆరోపించారు. పేదలపై భారాలు మోపి కార్పొరేటర్లకు రాయితీలు కల్పించారని, విదేశాంగ పెట్టుబడులు తీసుకురావడంలో వైఫల్యం చెందారని, వ్యవసాయ రంగాన్ని దివాలా తీయించారని, పర్యావరణ పరిరక్షణలో విఫలం చెందారని, భావ ప్రకటన స్వేచ్ఛపై అజమాయిషి చేస్తున్నారని ఆరోపించారు. 2014లో ఇదే బిజెపి, టిడిపి, జనసేన కూటమితో రాష్ట్రానికి ఏమి ఒరిగిందో చెప్పాలని ప్రశ్నించారు. బిజెపి మాయ మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని, ప్రత్యేక హెూదా లేని ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పరిచిన దుర్మార్గులకు ప్రజలు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు.

పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

కలకడ : పదవ తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సిఎస్‌లు శ్రీధర్, వెంకటరమణ, రామాంజులు తెలిపారు. మండలంలోని కలకడ, కోన, ఆదర్శ పాఠశాలలలో 10వ తరగతి పరీక్షలు నిర్వహణకు కేంద్రాలుగా ఏర్పాటు చేశారు.. ఈ క్రమంలో ఈనెల 18 నుంచి 10వ తరగతి విద్యార్థులకు జరిగే పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి 30 నిమిషాలు ముందుగా చేరుకోవాలని, ఎలాంటి ఒడిదుడుకులకు లోను కాకుండా పరీక్షలను నిర్భయంగా రాసుకోవాలని సూచించారు.



కల్వర్టు పనులను పరిశీలిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

రోడ్డు పనులు వేగవంతం చేయండి :'కొరముట్ల'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

చిట్వేలి-రైల్వేకోడూరు మధ్య రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని నేతివారిపల్లి గ్రామ సమీపాన కల్వర్టు నిర్మాణ పనులను చిట్వేలి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులురెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ రూ.40 కోట్లతో కల్వర్టు నిర్మాణ పనులు జరుగు తున్నాయని అన్నారు. ప్రజల రవాణా సౌకర్యం ఎంతగానో ఉపయోగప డుతున్న ఈ డబల్ రోడ్డు నిర్మాణంలో 8 కల్వర్టు నిర్మాణాలను ప్రజలకు ఇబ్బంది కలగకుండా, వీలైనంత త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్లు, అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏపి టూరిజం డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-సుండుపల్లి

బోరును ప్రారంభిస్తున్న గ్రామస్తులు

మండల కేంద్రంలోని కుమ్మరిపల్లె, చాకల పల్లి గ్రామాల్లో ఎర్రపురెడ్డి శరత్‌గిరిరెడ్డి రూ.3.59 లక్షల సొంత నిధులతో తాగునీటి మోటర్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలో 60 కుటుంబాలకు పైపులైన్ వేయించి ఆ గ్రామ ప్రజల దాహార్తిని తీర్చారు. గ్రామ ప్రజల తాగనీటి సమస్యను పరిష్కరించిన శరత్ గిరిరెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. గుల్లవాళ్ళపల్లి ప్రాథమిక పాఠశాల ప్రహరి లేక తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో ముమ్మరంగా ప్రహరీ పనులను వేగవంతం చేయిస్తు న్నారు. గ్రామంలో ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుక వస్తే పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

వైసిపి జిల్లా కార్యదర్శిగా అజయ్

ప్రజాశక్తి-కలికిరి

వైసిపి అన్నమయ్య జిల్లా యువజన విభాగ కమిటీ కార్యదర్శిగా కదిరికి చెందిన అజయ్ వేషాలు నియమితులయ్యారు. ఈ సందర్భంగా కలికిరి మండల యూత్ నాయకులు ఘనంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు పార్టీ పెద్దలకు, ఎమ్మెల్యే రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్ర మంలో కలికిరి మండల యూత్ నాయకులు కేఎంఆర్ బావా జాన్, షాహిర్‌బాషా, సుధాకర్, విజయ్, శివ పాల్గొన్నారు.

మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షులుగా జాహిద్‌అలీ

రాజంపేట అర్బన్ : వైసిపి మైనారిటీ విభాగం అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులుగా రాజంపేటకు చెందిన జాహిద్ అలీని నియమిస్తూ వైసిపి అధిష్టానం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా జాహిద్‌అలీ మాట్లాడుతూ తనపై విశ్వాసంతో తనను జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించిన సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జున రెడ్డిలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

మైనార్టీ జిల్లా కమిటీ జాయింట్ సెక్రటరీగా నిజాముద్దీన్

గాలివీడు : వైసిపిలో వివిధ విభాగాలు నుంచి జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేశారు.వైసిపి జిల్లా కమిటీ జాయింట్ సెక్రటరీగా ఎస్‌కె.నిజాముద్దీన్ నియామితులయ్యారు. నిజాముద్దీన్ నియామకం పట్ల గాలివీడు సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి, వైస్ ఎంపిపి-1, మిట్టపల్లి యదుభూషణరెడ్డి, వైస్‌ఎంపిపి2, గాలి శ్రీనివాసులు, అల్లూరు వైసిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

గోనెసంచుల పైకం వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-పీలేరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి చౌక దుకాణాల నిర్వాహకులకు రావలసిన గోనెసంచుల పైకం, పెండింగ్‌లో ఉన్న కమిషన్లను వెంటనే చెల్లించాలని రాష్ట్ర చౌక దుకాణ నిర్వాహకుల సంఘం సభ్యులు, పీలేరు మండల డీలర్ల సంఘ కార్యదర్శి పసుపులేటి వెంకటరమణ తెలిపారు. ఆదివారం ఆయన పీలేరులో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కరోనా కాలంలో రాష్ట్రవ్యాప్తంగా డీలర్ల నుంచి కొనుగోలు చేయాల్సిన బియ్యపు సంచులను. పైకం చెల్లిస్తామని చెప్పి ప్రభుత్వం నిర్బంధంగా తీసుకుని, మూడేళ్లు గడిచినా వాటికి ఇంతవరకు పైకం చెల్లించలేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న కమిషన్లను కూడా ఇప్పటివరకు చెల్లించలేదని వాపోయారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి బియ్యం గోదాముల అధికారుల నుంచి అందుకు సంబంధించిన వివరాలు తీసుకుని, వెంటనే డీలర్లకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

ఎన్నికల ప్రచారంలో వైసిపి నాయకులు

వైసిపి విజయమే మనందరి లక్ష్యం

ప్రజాశక్తి-పీలేరు

వైసిపి విజయం మన అందరి లక్ష్యం కావాలని, వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ప్రజలందరూ ఆశీర్వదించాలని పీలేరు, కెవి పల్లె మండలాల వైసిపి ఎన్నికల బాధ్యుడు పెద్దిరెడ్డి సుధీర్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జివి. శ్రీనాథ రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ నల్లగుట్ట, పద్మావతీ నగర్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారు ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు యదావిధిగా కొనసాగాలంటే వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి మరో సారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపి అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డిని, పీలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి ఎమ్మెల్యే అభ్యర్థి చింతల రామచంద్రా రెడ్డిలను గెలిపించి వారికి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జి.వి. రాకేష్‌రెడ్డి, మాజీ ఎఎంసి ఛైర్మన్ కడప గిరిధర్‌రెడ్డి, ఎంపిటిసి కంభం నరసిం హారెడ్డి, వార్డు సభ్యులు సాంబశివారెడ్డి, నాయకులు జయచంద్రారెడ్డి, రెడ్డిబాష, అభిషేక్, హుమయూన్, చక్రధర్, విజయశేఖర్ రెడ్డి, దావూద్ పాల్గొన్నారు.

పాస్పోర్ట్ పోయినది

అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం, గొర్లముదివీడు గ్రామం, బోయపల్లె డోర్ నెం.5/22 రాపూరి కాటయ్య కుమారుడు రాపూరి కాటయ్య గల ఒరిజినల్ పాస్ పోర్ట్ నెంబర్ M0377866 రాయచోటి ఆర్టీసి బస్టాండ్ లో పోయినది. ఎవరికైనా దొరికినచో 9347288284 మొబైల్ నెంబర్ కు తెలపగలరు.

రంజాన్ తోఫా పంపిణీ

ముద్దనూరు :స్థానిక సాయినగర్ కాలనీలో మహమ్మదీయ మసీదులో ఆదివారం కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ వారు 60 ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందజేశారు. కార్యక్రమంలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ బాబుభాయ్, స భ్యులు, ముద్దనూరు పా ల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

గాలివీడు : మాట్లాడుతున్న రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-గాలివీడు

రాయచోటి అసెంబ్లీ టిడిపిఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమక్షంలో ఆదివారం వైసిపి నాయకులు రాష్ట్ర మాజీ రెడ్డి సంఘం అధ్యక్షులు కసిరెడ్డి వెంకటశివారెడ్డి, మాజీ ఐటీ వింగ్ రాష్ట్ర జాయింట్ సెకరెట్రీ, అన్నమయ్య జిల్లా బిసి సంఘం అధ్యక్షులు సి.మల్లికార్జున టిడిపిలో చేరారు. ఆదివారం మండలంలోని గోరాన్ చెరువు గ్రామం కరిమిరెడ్డిగారిపల్లెలో కసిరెడ్డి వెంకట శివారెడ్డి నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన ప్రభు త్వంలో ప్రజలు అన్ని రకాలుగా మోస పోయారని, సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలైన పోలీస్ స్టేషన్లు, గ్రామ సచివాలయాలు, రెవెన్యూ కార్యాలయాలను వైసిపి కార్యాలయాలుగా మార్చి వ్యవస్థను నాశనం చేశారని అన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అరాచ కాలకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. కార్యక్ర మంలో టిడిపి యువ నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి, మండలంలోని మాజీ ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, బిసి నాయ కులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొర్లకుంట యువకులు చేరిక

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి తనయుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని కొర్లకుంటకు చెందిన యువకులు ఆదివారం టిడిపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సాయి వికాస్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర రాజకీయాలలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఎన్నికల కోడ్ మొదలు కావడంతోటే ప్రతిపక్షాల ప్రచార జోరు కూడా పెరిగిందని అన్నారు. టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు కూటమిగా ముందుకు సాగడానికి నిర్ణయించుకున్నాయి.చంద్రబాబు సారథ్యంపై ఉన్న నమ్మకంతో ముక్కా రూపానంద రెడ్డి భరోసాతో కొర్లకుంట నుంచి టిడిపి లోకి భారీ సంఖ్య లో చేరికలు జరిగాయని అన్నారు. టిడిపిలో చేరిన వారిలో కూరముట్ల హరీష్, మోడీ మహేంద్ర,ఎమిడి కళ్యాణ్, పాలంరెడ్డి శ్రీను, పి.హరికృష్ణ, కోయి విష్ణు,కొయు ప్రకాష్, ఎస్. చాను,ఓబిలి నర్సింహా,షైక్ చాను, కొరమట్ల మదన్,చీలి జగదీశ్,శివ ఆచారీ,ఉదయగిరి విజయ్,సుమంత్ చౌదరి,కూని సునీల్,నోశిన మణికంఠ రోహిత్ ఉన్నారు.

ముక్కా సాయివికాస్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామ యువకులు

మరోమారు అవకాశం కల్పించండి :ఎమ్మెల్యే

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-మొలకలచెరువు

నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రజలు మరోమారు అవకాశం కల్పించాలని తంబళ్లపల్లె వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని కాలువపల్లి గ్రామంలో పలు గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే తంబళ్లపల్లెను పులివెందుల తరహాలో అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వైసిపి పాలనలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. వైసిపి చేపట్టిన నవరత్నాలు పథకాల ద్వారా ఎంతో మంది పేద కుటుంబాలకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అండగా నిలిచిందని అన్నారు. పలు గ్రామాల్లో పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి దృష్టికి ప్రజలు సమస్యలను తీసుకువచ్చారు. త్వరలో జరిగే ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి రాగానే గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సాయి లీల ఉమమహేష్, జడ్‌పిటిసి మోహన్‌రెడ్డి, ఎంపిటిసి ఆయేషా చాంద్‌బాషా, వైస్ ఎంపిపి మల్లికార్జున, జిల్లా కార్యవర్గ సభ్యులు రవీంద్రారెడ్డి, విశ్వనాథ్, ఆముదాల మధుసూదన్ రెడ్డి, నాయకులు ఉపేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ప్రస్తుత సమాజానికి అద్దం మౌమితా ఆలం కవిత్వం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మాట్లాడుతున్న మహమూద్

నేడు ప్రపంచంలో జరుగుతున్న అనేక రాజకీయ సామాజిక పరిణామాలను మౌమితా ఆలం కవిత్వం అద్దం పడుతుందని కవి మహమూద్ కొనియాడారు. మౌమితా ఆలం ఆంగ్లంలో కవిత్వం రాస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన కవయిత్రి. కాగా ఆమె ఆంగ్లంలో రాసిన కొన్ని కవితలని విరసం సభ్యుడు కవి ఉదయమిత్ర తెలుగులోకి అనువదించి 'రాయకూడని పద్యం' పేరుతో పుస్తం రూపంలో తీసుకొచ్చారన్నారు. జనవిజ్ఞాన వేదిక (జెవివి), మత్రజ్యోతి సాహితీ సంస్థ సంయుక్తంగా ఆదివారం సాయంత్రం పరిచయ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తకాన్ని మహమూద్ పరిచయం చేస్తూ, ప్రస్తుతం దేశంలో దేశం బయట ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలన్నింటినీ స్పష్టమైన రాజకీయ అవగాహనతో బలమైన అభివ్యక్తితో కవిత్వంగా ఆలం ఆంగ్లంలో రాస్తే సరళమైన తెలుగులో ఉదయమిత్ర పాఠకులకు అందించారన్నారు. గోహత్య పేరుతో ముస్లింలను దళితుల మీద హింసను ప్రయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఇలాంటి వస్తువులతో కవయిత్రి కవిత్వం రాశారని అన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడిని తీవ్రమైన స్వరంతో అనేక కవితలలో విమర్శించారని అన్నారు. విరసం మాజీ కార్యదర్శి వరలక్ష్మి మాట్లాడుతూ మౌమితా ఆలం ఈ కాలాన్ని ప్రతిబింబించే విధంగా నియంతృత్వానికి ఆధిపత్య భావజా లానికి వ్యతిరేకంగా పీడిత ప్రజల పక్షాన బలమైన గొంతుకగా ఒక ముస్లిం స్త్రీగా ముస్లింలు ఎదుర్కొంటున్న వివక్ష పట్లే కాకుండా దళితులు ఆదివాసీలు వలస కార్మికుల వైపు నిలబడి కవిత్వం రాశారన్నారు. ఒక సంక్షోభ కాలంలో రచయితలు నిర్వహించాల్సిన పాత్ర పట్ల స్పష్టత ఉన్న కవి మేధావి మౌమిత అన్నారు. సాహసోపేతంగా ఫాసిజాన్ని నిలదీస్తూ రచనలు చేస్తున్న మౌమితా ఆలం ఈ తరం రచయితలకు స్ఫూర్తిదాయకం అన్నారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి సురేష్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సాహిత్యాభిమానులతోపాటు జెవివి జిల్లా అధ్యక్షులు పోలంకి శ్రీరాములు, చైతన్య మహిళా సంఘం సభ్యురాలు పద్మ, సాహితీవేత్త దాదా హయాత్, జింకా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మీటర్ రీడర్ల సమస్యను పరిష్కరించాలి

మీటర్ రీడర్ల కమిటీ సభ్యులతో సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న మీటర్ రీడర్ల సమస్యను పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, సిఐటియు కార్యదర్శి విజయకుమార్ కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం మీటర్ రీడర్ల నూతన కమిటీ ఎన్నిక అనంతరం వారు మాట్లాడుతూ.. రెండో నెల జరుగుతున్న మీటర్ రీడర్లకు ఇంతవరకు వేతనాలు ఇవ్వలేదన్నారు. వేతనం కూడా పీస్‌రేట్ ప్రకారం ఇస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అతి తక్కువ ధర ఇస్తూ కాంట్రాక్టర్లు, అధికారులు పంచుకుంటున్నారని ఆరోపించారు. తొమ్మిది రోజుల్లో చేయాల్సిన బిల్లులను ఆరు రోజుల్లో చేయమని వత్తిడి చేస్తున్నారన్నారు. ఎండలు విపరీతంగా ఉన్న పరిస్థితుల్లో ఏదైనా ప్రమాదం జరిగితే కాంట్రాక్టర్ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. 11రోజులు బిల్డింగ్ డేట్స్ ఇస్తూ ఎస్క్రో ద్వారా జీతాలు చెల్లించమని అధికారుల ఆదేశాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. ఇవ్వాల్సిన జీతాల్లో కాంట్రాక్టర్లు లక్షల రూపాయలు కొల్లగొడుతున్నారని, రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా మీటర్ రీడర్ల నందరిని కలుపుకొని సియండి కార్యాలయం ముట్టడి చేస్తామన్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా ప్రసన్నకుమార్ (చిన్న), ప్రధాన కార్యదర్శిగా బాలసుబ్బయ్య, కోశాధికారిగా సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా ఓబులేసు, సుదాకర్, కిరణ్, సహాయ కార్యదర్శిగా గోపాల్‌రెడ్డి, కార్యదర్శులుగా సుబ్బరాయుడు, శివప్రసాద్, కమిటీ సభ్యులుగా సురేష్‌కృష్ణ, 13 మందిని ఎన్నుకున్నారు.

మే ఐ హెల్ప్‌యూ ఆధ్వర్యంలో అనాథ మృతదేహానికి అంతిమ సంస్కారం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అనాథ మృతదేహానికి ఆదివారం మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులు అంతిమ సంస్కారం నిర్వహించారు. స్థానిక శ్రీరాంనగర్ వీధిలో నివాసముండే ఉట్టి రఘు (60) అనారోగ్యంతో మృతి చెందగా.. అంత్యక్రియలకు ఎవరూ ముందుకు రాలేదు. సమాచారాన్ని ఫౌండేషన్ చైర్మన్ లక్షణ్‌మోరేకు అందించారు. వెంటనే ఆయన స్పందించి అంతియ సంస్కరణలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సిఇఒ మల్లికార్జున, కోశాధికారి భార్గవ్‌సాయి పాల్గొన్నారు.

పిల్లల్లో సృజనాత్మకతను పెంచాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పిల్లల్లో సృజనాత్మకతను పెంచాలని జనవిజ్ఞానవేదిక (జెవివి) ప్రధాన కార్యదర్శి సునీత సూచించారు. క్రాఫ్ట్ క్లాస్‌లో భాగంగా ఆదివారం బంకమన్ను (క్లే)తో పలు రకాల బొమ్మలను కలర్ పేపర్‌తో టిష్యూ హోల్డర్ బాక్స్ తయారీ విధానం నేర్పించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో చేసిన వస్తువుల కంటే బంకమన్ను, పేపర్లతో చేసిన వస్తువుల వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదన్నారు. ఇలాంటివి నేర్చుకోవడం వల్ల పిల్లలు తమ ఇంట్లో పేపర్లు కనిపించినప్పుడు అందంగా రకరకాల వస్తువులను సులభంగా తయారు చేయగలుగుతారన్నారు. తద్వారా పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ రవికు మార్‌రెడ్డి కోరారు. ఆదివారం నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న బస్ షెల్టర్‌లో చలివేంద్రాన్ని మానవతా సేవా సంస్థ ఏర్పాటు చేసింది. జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి మాట్లాడుతూ వేసవి దృష్ట్యా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ సేవ కార్యక్రమాలు ప్రశంస నీయమన్నారు. ప్రయాణికులు, పాదచారులకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగ పడుతాయన్నారు. కార్యక్రమంలో మానవత వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి, ఛైర్మన్ చక్రపాణిరెడ్డి, సహాయ చైర్మన్ రవిశంకర్ గౌడ్, డైరెక్టర్ డాక్టర్ రాజారాం, ఓబుల్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపిటిసి భారతి, కోశాధికారి శ్రావణ్‌కుమార్, డాక్టర్ అరుణ్, గోపి, నాగేంద్ర పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి

సింహాద్రిపురం : క్రమశిక్షణ కలిగిన ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి తప్పనిసరిగా చేరు కుంటారని అనంతపురానికి చెందిన శ్రీ సత్యసాయి యూనివర్సిటీ హ్యూమన్ ఎక్సలెన్సు అండ్ యోగ కో-ఆర్డినేటర్ హనుమంత్ రెడ్డి పేర్కొ న్నారు. సింహాద్రిపురంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో ఆదివారం ఆయన విద్యార్థులకు భగవద్గీత సత్సంగం, క్రమశిక్షణపై అవగాహన సదస్సు నిర్వహిం చారు. కార్యక్రమంలో ధర్మవరానికి చెందిన గుర్రం వేణుగోపాల్, సంజీవరెడ్డి, మీడియా ఇంచార్జి యాగంటి బాలకృష్ణారెడ్డి, పప్పూరు నరసింహులు పాల్గొన్నారు.

బాలుర పాఠశాలకు రూ.50 వేలు వితరణ

ప్రజాశక్తి-వేంపల్లె

తలిశెట్టి సుబ్రహ్మణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టర్ సింగం రామలింగారెడ్డి ఆ పాఠశాలకి రూ.50వేలు వితరణ చేశారని ప్రధానోపాధ్యాయురాలు శివ మునెమ్మ తెలిపారు. 1959-60 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన సింగం రామలింగారెడ్డి ప్రొద్దుటూరు పట్టణంలో ప్రముఖ వైద్యులుగా సేవలు అందించారు. ప్రస్తుతం ఆయన కుమారుడు సింగం భాస్కర్ రెడ్డి కూడా కార్డియాలజిస్ట్‌గా వైద్య సేవలు అందిస్తున్నారు. ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేయడంతో పాఠశాల ఉపాధ్యాయులు దాతను అభినందించారు. ప్రతి ఏడాది వచ్చే వడ్డీతో ఫిబ్రవరిలో జరిగే పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి వాడుకోవాలని కోరినట్లు ప్రధానోపాధ్యాయురాలు శివమునెమ్మ తెలిపారు.

మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

విజయానికి కృషి చేయండి :'దాసరిపల్లి'

ప్రజాశక్తి-ములకలచెరువు

తంబళ్లపల్లె నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని, దాసరిపల్లి జయచంద్రారెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని టిడిని కార్యాలయంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు కలసి చదువుకొన్న పూర్వపు విద్యార్థులు, స్నేహితులతో ఆత్మీయ సమావేశం నిర్వహజంచారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ టిడిపి తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం దక్కిందని, అన్నారు. స్నేహితులుగా మీరంతా జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో సహకరించాలని కోరారు. తంబళ్లపల్లె నియోజకవర్గం రాష్ట్రంలోనే వెనుకబడి ఉందని తెలిపారు. వ్యాపార రంగంలో స్థిరపడ్డ నేను తనవంతుగా సొంత నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయాలనే తపనతో రాజకీయ రంగ ప్రవేశం చేయడం జరిగిందన్నారు. రైతులకు వ్యవసాయపరంగానూ, ఇండస్ట్రియల్ ఏర్పాటు పరంగానూ, ప్రజలకు అభివృద్ధి చేయడమే లక్ష్యంగాపెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రమణప్ప, చంద్ర, శ్రీనివాసులు, ప్రభాకర్ రెడ్డి, చంద్ర, కల్పనా , రాజేశ్వరి, చిట్టెమ్మ, సుజాత పాల్గొన్నారు.

ఎపిపిగా నాగమల్లిరెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోట అసిస్టెంట్ పబ్లిక్ ప్రాని క్యూటర్ కాకుండా గుండ్లపల్లి పంచాయతీ వేమారెడ్డి గారి పల్లెకు చెందిన మొత్తిని నాగమల్లిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలబడ్డాయి. నాగమల్లి రెడ్డి ఎంపిక పట్ల తంబళ్లపల్లి కోర్టు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. నాగమల్లిరెడ్డి ఇప్పటికే తంబళ్లపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు.

ఘనంగా శ్రీచౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు

ప్రజాశక్తి - కడప

శ్రీ చౌడేశ్వరి దేవి మూడవ వార్షికోత్సవ జ్యోతి ఉత్సవాలను శనివారం 12:30 గంటల నుండి ఆదివారం ఉదయం 7:00 గంటల వరకు ఘనంగా ఆలయఉత్సవ కమిటీ సభ్యులు గోవిందు నాగరాజు, సంగీనాదం ఆంజనేయులు, కొరముట్ల పెద్ద సుబ్బరాయుడు, ఇట్టే వేణుగోపాల్, సిఆర్‌ఐ సునీల్ జయంత్ ఆధ్వర్యంలో కడప నగరంలోని శ్రీ విజయ దుర్గ కాలనీలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి జ్యోతి ఉత్సవాలను నగర ప్రజలు, భక్తుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఉత్సవ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం 4:30 గంటల నుండి విజయ దుర్గ కాలనీలో గల పార్కు నుండి ఊరేగింపుగా బిందు సేవకు శ్రీ విజయ దుర్గాదేవి ఆలయానికి వచ్చారు. కలశాలు ధరించిన భక్తులు పార్కుకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. అర్ధరాత్రి 12:30 గంటల నుంచి శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతులను శ్రీ దివ్య జ్ఞానంద గిరి స్వామీజీ జ్యోతులను వెలిగించి ఆలయం పురవీధుల్లో భక్తులకు కనువిందుగా చేశారు. ఈ సందర్భంగా శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారికి భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నగర అధ్యక్షులు కళ్యా సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రమణ్యం, పల్లా నరసింహారావు, కోశాధికారి సుదర్శన్, గౌరవాధ్యక్షులు సుంకర రామచంద్రుడు, ఉపాధ్యక్షులు చౌడం సూరిబాబు, 21వ డివిజన్ వైసిపి నాయకులు మోతుకూరి సుబ్బరాయుడు, కాలనీవాసులు పట్టు పోగులు రాము, కడప నగర ప్రజలు, విజయదుర్గా కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో కమిటీ సభ్యులు

క్రైం కార్నర్

భర్త చేతిలో భార్య దారుణ హత్య

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రమణమ్మ(ఫైల్ ఫొటో)

మండలం కుర్నూతుల గ్రామం బొమ్మెపల్లి గ్రామంలో బొమ్మేపల్లి యోగానందరెడ్డి తన భార్య రమణమ్మను(32) అను మానంతో గొంతుకు చున్నీ తో బిగించి హత్య చేసి పోలీసు స్టేషన్‌లో లొంగిపోయినట్లు పోలీసులు తెలి పారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మృతురాలు రమణమ్మ యోగా నంద రెడ్డికి రెండో భార్య అని తెలిపారు. మృతురాలికి ఆరు సంవత్సరాల కుమార్తె చంద న ఉందని అన్నారు. గత కొంతకాలంగా భార్యపై అనుమానం పెంచుకున్న యోగానంద రెడ్డి భార్య రమణమ్మతో తరచు గొడవ పడుతూ ఉండేవాడని తెలిపారు. ఆదివారం ఇంటిలో రవణమ్మకు చున్నీతో గొంతుకు బిగించి హత్య చేసినట్లు తెలిపారు. సిఐ జీవన్ గంగానాథ్‌బాబు, ఎస్‌ఐ విష్ణువర్ధన్ ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని చెప్పారు. అనంతరం మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని అనంతరం బంధువులకు అప్పగిస్తామని చెప్పారు.హెడ్ కానిస్టేబుళ్లు రాంప్రసాద్ గోపి నాయక్, విఆర్‌ఒ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-పెద్దమండ్యం

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చెన్నకేశవ తెలిపారు. గుర్రంకొండ మండలం టి.పసలవాండ్లపల్లికు చెందిన రమేష్, చిన్నమండ్యం రోడ్డు నుంచి 15 మద్యం బాటిళ్లు తీసుకొని పెద్దమండ్యం విద్యుత్ కేంద్రం సమీపంలోకి రావడంతో తనిఖీలు చేపట్టి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుళ్లు కిరణ్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు